సీనియర్ పాత్రికేయుడికి పరామర్శ

గాంధీ ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి, ఫిబ్రవరి 2: మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు బెజుగం సురేశ్ తండ్రి గాంధీ ఇటీవల మృతిచెందాడు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం రేగులపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు త్రిషుల్ సోదరి పెండ్లికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, బండి రమేశ్, బండిపెల్లి రమేశ్, బిగుల్ల మోహన్, తాడిచెట్టు భూమయ్య, తిరుపతి, విశ్వప్రసాద్ ఉన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న జడ్జి

పొట్లపల్లిలో రాజేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న జిల్లా జడ్జి దంపతులు

ఆలయంలో పూజలు చేస్తున్న జడ్జీ సాయిరమాదేవి

బెజ్జంకి, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ప్రాంతంలో పురాతన దేవాలయంలో ఉండటం సంతోషకరమన్నారు. ఆమె వెంట ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, ఏఎస్సై శంకర్‌రావు, నాయకులు, గ్రామస్తులు ఉన్నారు..

రాజేశ్వరస్వామి ఆలయంలో..

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం జిల్లా జడ్జి సాయిరమాదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు జడ్జీ దంపతులకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకొని అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కర్ర రవీందర్‌రెడ్డి, కానుగుల మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు

కష్టానికి దక్కిన ఫలితం

గోల్డ్ మెడల్ సాధించిన రాయపోల్ విద్యార్థిని మానస

కలశలింగం యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్ అందుకుంటున్న విద్యార్థిని మానస

రాయపోల్,జనవరి 2 : చెన్నైలోని మధురై కలశలింగం యూనివర్సిటీ 37వ స్నాతకోత్సవం సందర్భంగా రాయపోల్ విద్యార్థిని బీటెక్ ఫుడ్ టెక్నాలజీలో గ్రాడ్యుయేట్ పట్టాతో పాటు గోల్డ్ మెడల్ సాధించి ప్రశంసాపత్రాన్ని సోమవారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నుంచి అందుకున్నది. బీటెక్ ఫుడ్ టెక్నాలజీలో మంచి ర్యాంకు సాధించిన మానసను యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అభినందించారు. సిద్దిపేట జిల్లా రాయపోల్‌కు చెందిన మానస రెండో తరగతి నుంచి ముబారాస్‌పూర్ తర్వాత గజ్వేల్‌లోని మంజీరాస్కూల్‌లో చదివింది. ప్రజ్ఞాపూర్‌లో సెయింట్ మేరీస్‌స్కూల్‌లో చదివిన తర్వాత శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ 950 మార్కులతో పూర్తిచేసింది. తర్వాత ఎంబీబీఎస్ కోసం నీట్ పరీక్షలు రాసినప్పటికీ స్వల్పమార్కులతోనే సీటును కోల్పోయింది. అయినప్పటికీ పట్టుదలతో చెన్నైలోని మధురై కలశలింగం యూనివర్సిటీలో బీటెక్ ఫుడ్‌టెక్నాలజీ చదవడానికి ఎంట్రెన్స్ రాసి సీటు సాధించింది. గల్వా మానస అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చడంపై వారి తల్లిదండ్రులు మహేందర్‌రెడ్డి, రేఖ, గ్రామస్తులు, మండలంలోని వివిధ పార్టీల నాయకులు అభినందించారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

గజ్వేల్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, రీజినల్ చైర్మన్ సంతోష్ దంపతులు

గజ్వేల్, ఫిబ్రవరి 2: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్సీ.రాజమౌళి అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో రీజినల్ చైర్మన్ గొలి సంతోష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యాపాభివృద్ధిలో రాణిస్తూ సేవా కార్యక్రమాలు చేయడంలో ముందున్న రీజినల్ చైర్మన్ సంతోష్ మరింతగా సేవా కార్యక్రమాలు విస్తరించాలన్నారు. పేద వధువులకు పుస్తెమట్టెల పంపిణీ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించడంపై ఆయన్ని సన్మానించారు. కార్యక్రమంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేసిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో గవర్నర్ నగేశ్ పంపాటి, పరమేశ్వరాచారి, మెట్టయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో కనువిప్పు

కొమురవెల్లిలో మాట్లాడుతున్న ఎస్సై రాజు

కొమురవెల్లి, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొమురవెల్లి ఎస్సై లింగంపల్లిరాజు హాజరై మాట్లాడారు. దేవుడి దర్శనం కోసం వచ్చే భక్తులు జాగ్రత్తగా ఉండాలని, చైన్ స్నాచింగ్, పిక్ పాకెటింగ్ జరిగే అవకాశం ఉందన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల మాటలు నమ్మవద్దన్నారు. మూఢనమ్మకాలు, సామాజిక రుగ్మతలు, సోషల్ మీడియా ప్రభావం, మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పోలీస్ కళాబృందం సభ్యులు, తెలంగాణ సాంస్కృతిక కళాకారులు, భక్తులు పాల్గొన్నారు.

పరిస్థితి విషమించి రైతు మృతి

రైతు నర్సింహులు (ఫైల్)

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 2 : ఆర్థిక ఇబ్బందులతో రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా పరిస్థితి విషమించి మృతి చెందిన సంఘటన కొండపాక మండలంలోని దుద్దెడలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బూర్గుల నర్సింహులు(56)కు దుద్దెడలో మూడు ఎకరాల భూమి ఉంది. అందులో పలుమార్లు బోరు వేసినా నీరు సరిగ్గా రాలేదు. వేసిన పంటలు సక్రమంగా పండకపోవడంతో అప్పులపాలయ్యాడు. దీనికి తోడు కూతురు పెండ్లి కోసం మరిన్ని అప్పులు చేశాడు. ఎకరం 20 గుంటల భూమి అమ్మినా అప్పులు తీరకపోవడంతో పాటు మిగిలిన ఎకరం 20 గంటల్లో వేసిన పంట సరిగ్గా రాక నష్టం జరిగింది. కుటుంబ పోషణ కోసం మళ్లీ అప్పు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో మనస్తాపానికి గురైన నర్సింహులు జనవరి 31న సాయంత్రం తన వ్యవసాయబావి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించిన పొరుగు రైతు నర్సింహులు పురుగుల మందు తాగిన విషయం అతడి కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు సిద్దిపేటలో ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య రాధ, కుమారులు నాగరాజు, నవీన్, కూతురు రేణుక ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్ నాయకులపై కేసులు నమోదు చేయాలి

చేర్యాలలో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాలలో జాతీయ రహదారి పై ధర్నా చేసిన బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, ఫిబ్రవరి 2 : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎన్నికైనప్పటి నుంచి కాంగ్రెస్ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నాడని, కార్యకర్తలతో అప్రజాస్వామిక పనులు చేయిస్తున్నాడని, తాడూరులో ఎమ్మెల్యే పల్లా ఫ్లెక్సీని అవమానించిన కాంగ్రెస్ నాయకుల పై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ చేర్యాల పట్టణంలోని జాతీయ రహదారి పై పోలీస్‌స్టేషన్ ఎదుటే ఆదివారం చేర్యాల టౌన్, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఆందోళన నిర్వహించారు. తాడూరులో ఎమ్మెల్యే ఫ్లెక్సీకి చెప్పులదండ వేసి అవమానించిన వారిపై ఫిర్యాదు చేసినప్పటికీ ఎందుకు పట్టించుకోవడం లేదని పీఎస్‌కు వెళ్లి బీఆర్ఎస్ నాయకులు పోలీసులను ప్రశ్నించారు.పోలీసుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో పోలీసుల వైఖరిని నిరసిస్తూ, ఫ్లెక్సీని అవమానించిన నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జాతీయ రహదారి పై బైఠాయించారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్సై నరేశ్ పోలీస్ బలగాలతో వచ్చి ఆందోళన చేస్తున్న నాయకులను సముదాయించారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నాయకులు ఫ్లెక్సీ ఘటనకు కారణమైన వారిపై కేసులు నమోదు చేసే వరకు తాము ఆందోళన కొనసాగిస్తామని భీష్మించుకుని కూర్చున్నారు.తిరిగి పోలీసులు నాయకులను రోడ్డు పై నుంచి పక్కకు జరిపి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, అనంతుల మల్లేశం, మేక సంతోష్, మంద యాదగిరితో పాలు నాలుగు మండలాల ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలి

మండలంలోని తాడూరులో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫ్లెక్సీకి చెప్పుల దండ వేసి అవమానించడం హేయమని, కార్యకర్తలు చేసిన తప్పుడు పనులకు నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన జేఏసీ చైర్మన్ వకులాభరణం నర్సయ్యపంతులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఫ్లెక్సీని అవమానించడాన్ని అఖిలపక్ష, జేఏసీ నాయకులు ఆదివారం పట్టణంలో జరిగిన సమావేశంతో తీవ్రంగా ఖండించారు. అనంతరం జేఏసీ చైర్మ న్ వకులాభరణం నర్సయ్యపంతులు, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, టీడీపీ, ఎమ్మార్పీ

చేర్యాలలో మాట్లాడుతున్న చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ వకులాభరణం నర్సయ్యపంతులు

ఎస్టీఎస్ నాయకులు పుర్మ వెంకట్‌రెడ్డి, బూగురు సురేశ్‌గౌడ్, కొంగరి వెంకట్‌మావో, మిట్టపల్లి నారాయణరెడ్డి, భూమిగారి రాజేందర్ పట్టణంలోని బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు పాటించకుండా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తన కార్యకర్తలతో ఇలాంటి పనులకు తెరతీస్తున్నాడని వెంటనే పద్ధతులు మానుకోవాలని హితవు పలికారు.చేర్యాల ప్రాం తంలో అప్రజాస్వామికమైన కవ్వింపు చర్యలకు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి బాధ్యత వహించాలని బేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ఉన్న చేర్యాల ప్రాంతంలో అప్రజాస్వామిక చర్యలను ప్రోత్సహించే తప్పుడు బుద్ధిని మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, నాయకులు కూరపాటి మధు, పోతుగంటి రామదాసు, పచ్చిమడ్ల సిద్ధిరాములు, బూరగోని తిరుపతిగౌడ్, బండి సుదర్శన్, బీరెడ్డి ఇన్నారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాళ్లబండి నాగరాజు, పోలోజు శ్రీహరి, ముస్త్యాల ప్రభాకర్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసన వెల్లువ

సిద్దిపేట కొత్త బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

సిద్దిపేట,ఫిబ్రవరి 2: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రూ.50,65,345 కోట్ల బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు, బడా పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉన్నదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాముని గోపాలస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లబండి శశిధర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ఆరోపించారు. ఆదివారం సిద్దిపేటలోని కొత్త బస్టాండ్ సెంటర్‌లో కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఉన్న రూ.40 కోట్ల మంది కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా కేంద్రం బడ్జెట్ రూపకల్పన చేశారన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. గ్రామీణ పేదలకు ఎంతో ఉపయోగపడుతున్న ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు నిధులు కేటాయింపు చేయలేదని విమర్శించారు. పీఎం ఆవాస్ యోజన కింద సంవత్సరానికి రెండు కోట్ల ఇండ్లు నిర్మిస్తామని చెప్పిన ప్రభుత్వం బడ్జెట్‌లో అందుకు తగిన విధంగా నిధులు కేటాయించలేదని విమర్శించారు. ప్రజాసంఘాల నాయకులు చల్లరపు తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, అమ్ముల బాల నరసయ్య, దాసరి ప్రశాంత్, తాటోజు రవీంద్రాచారి, బత్తుల అభినవ్, శ్రవణ్ పాల్గొన్నారు.

వేల గొంతులు.. లక్షడప్పుల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చేర్యాలలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వర్గల్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చేర్యాల, ఫిబ్రవరి 2 : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ కోసం ఈ నెల 7న హైదరాబాద్‌లో మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేల గొంతులు లక్షల డప్పుల సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు దళిత సంఘం నాయకులు మాట్లాడుతూ మాదిగల ఆత్మగౌరవం పోరాటం విజయం సాధించే సమయం ఆసన్నమైందని, సభకు భారీగా తరలిరావాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు డాక్టర్ రామగల్ల పరమేశ్వర్, భూమిగారి రత్నం, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, ముస్త్యాల కిష్టయ్య, భూమిగారి మనోహర్, మల్లిగారి యాదయ్య, సనవల్ల ప్రసాద్, సంతోష్, విజయ్, భూమిగారి మధుకర్, మల్లిగారి సూరయ్య,రామగల్ల కిశోర్ పాల్గొన్నారు.

వర్గల్‌లో

వర్గల్, ఫిబ్రవరి 2: హైదరాబాద్‌లో ఈనెల 7న మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణకోసం తలపెట్టిన వేయిగొంతులు,లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి చేబర్తి యాదగిరి కోరారు. ఆదివారం వర్గల్ మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తావద్ద వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టుతీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఎస్సీ వర్గీకరణ కోసం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు డ్యాగ నవీన్‌కుమార్, మండల బాధ్యులు నవీన్‌కుమార్, మాజీ ఎంపీటీసీ స్వాతి, ఆయా గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయులు పాల్గొన్నారు.

మెడల్స్ అందుకున్న దుద్దెడ విద్యార్థులు

ఒకినోవా మార్షల్ ఆర్ట్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మెడల్స్ అందుకున్న దుద్దెడ విద్యార్థులు

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 2 : ఒకినోవా మార్షల్ ఆర్ట్స్‌లో కొండపాక మండలంలోని దుద్దెడ విద్యార్థులు ప్రతిభ కనబర్చి మెడల్స్ అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కటాస్ విభాగంలో వడ్లకొండ స్నేహిన్ తేజ్, వి.మోక్షిత్ గోల్డ్ మెడల్ సాధించగా కటాస్ విభాగంలో ఆకాంక్ష సిల్వర్ మెడల్, స్పైరింగ్ విభాగంలో కాస్య పథకాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా ఇన్‌స్ట్రక్టర్ తిరుపతి నర్సింహులు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంచేందుకు కరాటే నేర్పిస్తున్నట్లు తెలిపారు.

కూలీ బీమా ప్రవేశపెట్టాలి

కొల్గూర్‌లో ఉపాధి హామీ కూలీలతో డీబీఎఫ్ నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 2: ఉపాధి హామీ కూలీలకు, భూమి కలిగిన వ్యవసాయ కూలీలకు ఇచ్చే రైతు బీమాలాగా ప్రభుత్వం కూలీబీమా ప్రవేశపెట్టాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. ఆదివారం మండలంలోని కొల్గూర్‌లో ఉపాధి హామీ దినోత్సవం సందర్భంగా కూలీలతో కలిసి ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా 740 జిల్లాల్లోని 7,86,927 గ్రామాల్లో 14.55 కోట్ల కుటుంబాలు ఉన్నాయన్నారు. ఉపాధి పనికి వెళ్లే వారిని చూస్తే ప్రతి ఏడు రూ.3 లక్షల కోట్లు అవసరం ఉంటే కేంద్రం బడ్జెట్‌లో రూ.86కోట్లను మాత్రమే కేటాయించి అన్యాయం చేస్తున్నదన్నారు. ఏడాదిలో కూలీకి 100రోజుల పనులు కల్పించాల్సి ఉండగా కేవలం 41రోజులు మాత్రమే కల్పిస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నదన్నారు. ఉపాధి కూలీల పొట్టకొట్టే ప్రయత్నాలను కేంద్రం వెనక్కి తీసుకోవాలని,గ్రామీణ ప్రాంత కూలీలను దృష్టిలో ఉంచుకొని వందరోజులు పని కల్పించాలన్నారు. జిల్లాలో 1,99,540 జాబ్ కార్డులు ఉన్నవారుంటే 20 రోజుల పని నిబంధనలతో కేవలం 75వేల మందికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తిస్తున్నదన్నారు. రూ.2లక్షల ప్రమాదబీమాను రూ.10లక్షలకు పెంచాలన్నారు. డీబీఎఫ్ నాయకులు మైసయ్య, జితేందర్, కూలీలు పాల్గొన్నారు.

రామునిపట్లలో క్రికెట్ పోటీలు ప్రారంభం

రామునిపట్లలో టీషర్ట్స్‌ను ఆవిష్కష్తున్న మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి

చిన్నకోడూర్ ఫిబ్రవరి 2: క్రీడలు యువతలో మానసిక ఆరోగ్యాన్ని, మనోధైర్యాన్ని కలిగిస్తాయని మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రామునిపట్లలో మిట్టపల్లి మల్లవ్వ – రాజయ్య జ్ఞాపకార్థం వారి మనువడు మిట్టపల్లి గణేశ్ నిర్వహిస్తున్న ఆర్సిఎల్ – 9 క్రికెట్ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, సుంచు రమేశ్, యువ నాయకుడు గుజ్జ రాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వికులను గుర్తుచేసుకుంటూ వారి జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం మంచి విషయమన్నారు. నిర్వాహకుడు మిట్టపల్లి గణేశ్ క్రీడాకారులకు 70 టీ షర్ట్స్‌ను స్పాన్సర్ చేశారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.5016, రెండో బహుమతి రూ.2516 ఉంటుందని మిట్టపల్లి గణేశ్ తెలిపారు. కార్యక్రమంలో ఇబ్రహీంనగర్ మాజీ సర్పంచ్ నెమలి సుభాష్, ఆకుల శివకుమార్, శనిగరం శ్రీనివాస్, శెట్టిపల్లి భానుచందర్, బొల్లం భాను, కట్కూరు శ్రీనివాస్, బైతి శంకర్, పంతం సాయి కిశోర్, కర్రె మహేందర్, మిట్టపల్లి పరశురాములు, కురపాటి నరేశ్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడం బాధాకరం

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒక్క రూపాయి నిధులను నరేంద్రమోదీ సర్కార్ కేటాయించకపోవడం బాధాకరమని, రాష్ట్రానికి బడేబాయ్, చోటేబాయ్ తీరని ద్రోహం చేస్తున్నారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణపై సవతితల్లి ప్రేమను కూడా నరేంద్రమోదీ చూపెట్టడం లేదన్నారు. తెలంగాణ నుంచి కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం ఎంపీలు 17 మంది ఉన్నా బడ్జెట్‌లో రాష్ట్రానికి గుండు సున్నా కేటాయించడం దుర్మార్గమని, మూడు పార్టీల అసమర్థ నాయకత్వానికి నిదర్శనమన్నారు. కేంద్రంలో బడే బాయ్ రాష్ట్రంలోని జీఎస్టీ ద్వారా నిధులను దర్జాగా వసూలు చేసి రాష్ట్రానికి మొండి చెయ్యి చూపించారన్నారు. సీఎం రాష్ట్ర రాబడిని ఢిల్లీ వాసులకు మూటలు పంపుతూ రాష్ట్రాన్ని దివాళా తీయిస్తున్నారన్నారు. బడే బాయ్, చోటే బాయ్ ఇద్దరూ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని, ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. 30 సార్లు ఢిల్లీ వెళ్లిన రేవంత్‌రెడ్డి నరేంద్రమోదీని ఎందుకు కలిశారో ప్రజలకు చెప్పాలన్నారు. కనీసం తెలంగాణకు రావాల్సిన నిధులను రాబట్టడంలో ఎంపీలు విఫలమయ్యారని దుయ్యబట్టారు. కేంద్ర మంత్రులు ఇద్దరూ గులాంగిరికి, చీకటి ఒప్పందాలు చేసుకోవడానికి మాత్రమే సరిపోతున్నారని ఆరోపించారు. 30సార్లు ఢిల్లీ వెళ్లిన రేవంత్‌రెడ్డి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ పార్టీతీరు చూస్తే తెలంగాణ రాష్ట్ర నిధులను దండుకోవడమే లక్ష్యంగా ఉందన్నారు. కాజీపేటకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ప్రాజెక్టులకు జాతీయహోదా ఇవ్వలేదన్నారు. కేంద్రం నుంచి నిధు లు రాబట్టాలంటే బీఆర్ఎస్‌కే సాధ్యమవుతుందన్నారు.

అరుణాచలగిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

హుస్నాబాద్, ఫిబ్రవరి 2: తమిళనాడులోని అరుణాచల పుణ్యక్షేత్రానికి హుస్నాబాద్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు నడిపించనున్నట్లు డిపో మేనేజర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 10వ తేదీన సాయంత్రం హుస్నాబాద్ నుంచి బయల్దేరి హైదరాబాద్ మీదుగా కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం ఫిబ్రవరి 11వ తేదీ రాత్రి అరుణాచలానికి చేరుకుంటుందన్నారు. దర్శనం అనంతరం ఫిబ్రవరి 12న సాయంత్రం బయల్దేరి అలంపూర్ జోగులాంబ దర్శన అనంతరం ఫిబ్రవరి 13వ తేదీ సాయంత్రం వరకు హుస్నాబాద్‌కు బస్సు చేరుకుంటుందని డీఎం పేర్కొన్నారు. ఈటూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి సమాచారం కోసం యాత్రికులు సెల్: 9959225930, 7382 848449, 8790465049 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండా పండుగ

చిన్నకోడూర్, ఫిబ్రవరి 2: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహించనున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. 4 తేదీన అనంతసాగర్‌లో ఉదయం ఎనిమిది గంటలకు, చెర్లఅంకిరెడ్డిపల్లిలో ఉదయం తొమ్మిది గంటలకు, 5వతేదీన కిష్టాపూర్‌లో ఉదయం ఎనిమిది గంటలకు, అల్లిపూర్‌లో ఉదయం తొమ్మిదిగంటలకు, 6వ తేదీన వీరలాపూర్‌లో ఉదయం ఎనిమిది గంటలకు, రంగాయపల్లిలో ఉదయం తొమ్మిది గంటలకు జెండా పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నకోడూరు మండల సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన విద్యార్థి యవకులు, మహిళా నాయకురాళ్లు, పార్టీ అనుబంధశాఖల అధ్యక్షులు, బీఆర్ఎస్ శ్రేణులు జెండా పండుగలో పాల్గొనాలని ఆయన కోరారు.

రాష్ట్రానికి ఎంపీలు సాధించింది సున్నా

ఉడేం కృష్ణారెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 2: కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఉన్నా బడ్జెట్‌లో రాష్ట్రానికి తీసుకురావడంలో వారు సాధించింది సున్నా అంటూ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఉడేం కృష్ణారెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా ఆ